క్లుప్తంగా

విజయదుర్గా ఆలయంలో చండీహోమం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం విశేష పూజలను నిర్వహించారు. అమావాస్య సందర్భంగా మల్లేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అమ్మవారికి విశేషంగా చండీహోమం జరిపారు. తొలుత స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అలంకరణ చేశారు. పలువురు ఉభయ దాతలు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది.

టేకి నరసింహాచార్యుల సేవలు అపూర్వం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యారంగానికి, విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి టేకి నరసింహాచార్యులు అందించిన సేవలు అపూర్వమని విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గొర్తి శ్రీనివాసచక్రవర్తి, ప్రధాన కార్యదర్శి తోలేటి శ్రీకాంత్ అన్నారు. బ్రహ్మశ్రీ టేకి నరసింహాచార్యులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ భవనంలో శ్రీనివాస్ చక్రవర్తి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ టేకి నరసింహాచార్యులు ఎడ్యుకేషన్ ట్రస్టుచే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మశ్రీ టేకి నరసింహాచార్యులు విశ్వబ్రాహ్మణ విద్యార్థుల విద్యా భవిషత్ కోసం ఎంతో గొప్ప మనసుతో వారి ఆస్తిని సంస్థకు అందించి దానిపై వచ్చే ఆదాయంతో ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్‌లు అందించాలని సూచించారన్నారు. ఈ ఏడాది 150 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1,200 చొప్పున స్కాలర్ షిప్‌లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు పెదప్రోలు బ్రహ్మం, నడిపల్లి ప్రసాద్, ఎం.జేజిబాబు, చిట్టూరి రాజేష్, చెవూరి ఓంకార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉండాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరద బాధిత కుటుంబాలకు అందరూ అండగా ఉండాలని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. వంకదారు రంగయ్య, శకుంతల విద్యానిధి చైర్మన్ వంకదారు వాసుదేవ రావు ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని కేబీఎన్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన తూనికుంట్ల శ్రీనివాసు, కోశాధికారి హరగోపాల్, హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్‌లు పుస్తకాల పంపిణీని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వంకదారు వాసుదేవరావు తమ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. కళాశాల కమిటీ సభ్యులు రామకిషోర్, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



మధురానగర్/అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): నగరంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు భానుడి ప్రతాపంతో అల్లాడిన నగర వాసులు వర్షంతో ఉపశమనం పొందారు. బుడమేరు వరద ముంపు జరిగి నెలరోజులు గడిచినా.. నగరంలోని పలు ప్రాంతాల్లో వరద ఆనవాలు కనిపిస్తూనే ఉన్నాయి. వాటిని ఇప్పుడిప్పుడే మరచిపోదామనుకుంటున్న వరద ముంపు బాధితులను అకాలంగా వస్తున్న వర్షాలు వణుకు పుట్టిస్తున్నాయి. బుధవారం నాటి వర్షంతో నగరంలోని ప్రధాన రహదారులు నీటమునిగాయి. ప్రధాన కాలువల్లో పూడికలను త్వరితగతిన తీయించి వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దసరా ఉత్సవాలకు వేళాయె





ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. గురువారం నుంచి ప్రారంభంకానున్న ఉత్సవాలకు ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







మహాత్ముని ఆశయ సాధనకు కృషి

- బాపు త్యాగాలను స్మరించిన నాయకులు, అధికారులు
- వాడవాడలా ఘనంగా గాంధీజీ జయంతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాత్ముని ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిని వాడవాడలా బుధవారం ఘనంగా నిర్వహించారు. మహనీయుల త్యాగాలను వక్తలు కొనియాడారు. మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని ఆచరణలో చూపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గాంధీజీ, శాస్త్రిల జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ నేత పోతిన మహేష్ తదితరులు నివాళులర్పించారు. మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు షేక్ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్య రెడ్డి, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలకు చంద్రబాబు తూట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాంధీజీ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. వించిపేటలోని ఆసిఫ్ కార్యాలయంలో గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రిల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలతో కలిసి ఆసిఫ్ మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రోశిరెడ్డి, కేసరి చిన్నోడు, వినోద్‌కుమార్, రమేష్, కల్యాణ్, దొడ్డా సురేష్, స్వామి, వంశీ, జాషువా, దుర్గారావు యునస్, కాజా తదితరులు పాల్గొన్నారు.

పోతిన మహేష్ కార్యాలయంలో..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ కార్యాలయంలో గాంధీజీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. పోతిన మహేష్ పార్టీ నేతలతో కలిసి గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన చూపిన బాటలో అందరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

కేబీఎన్ కళాశాలలో...

కేబీఎన్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలను నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు శ్రమదానం, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ, గాంధీజీ విగ్రహాల శుభ్రపరచటం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఆఫీసర్ కేపీటీ విజయభాస్కర్ మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన మార్గంలో విద్యార్థులు పయనించాలన్నారు.



గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, పోతిన మహేష్ తదితరులు

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడు..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో చోటుచేసుకున్న మతోన్మాద నేతల నుంచి దేశాన్ని కాపాడాలని ఏపీసీసీ సభ్యుడు, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు కోరారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకొని కాళేశ్వర రావు మార్కెట్ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. సీనియర్ నేతలు మువ్వా మోహనరావు, పీసీసీ ఉపాధ్యక్షులు వి.గురునాథం, ఖుర్షిదా తదితరులు పాల్గొన్నారు.

గాంధీహిల్‌లో..

గాంధీ పర్వత సంస్థ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు గాంధీహిల్‌పైన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించారు. వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కస్తూరి సీతారామయ్య స్కూల్‌లో..

వించిపేట(విజయవాడపశ్చిమ): లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేటలోని కస్తూరి సీతారామయ్య స్కూల్‌లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేవీపీఎస్ పశ్చిమ నగర కార్యదర్శి కె.మోజెస్ పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్తిబాబు, స్కూల్ హెచ్‌ఎం అరుణకుమారి, లౌకిక ప్రజాస్వామ్య వేదిక నాయకులు హేమచంద్, ఎస్‌కే చిన్నబాబు, దుర్గారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గాలు సదా ఆచరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సత్యం, అహింస, శాంతి, సేవ వంటి మార్గాలను ఆచరించి చూపిన మోహన్‌దాస్ కరం చంద్ గాంధీ వేసిన బాట సదా ఆచరణీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ గెలాక్సీ సభ్యులు పేర్కొన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా గెలాక్సీ సభ్యుల ఆధ్వర్యంలో భవానీపురంలోని శ్రీవెంకట సాయి సేవా వృద్ధాశ్రమంలో బుధవారం రైస్ బ్యాగ్, నిత్యావసర సరుకులు, వరదల కారణంగా పాడైపోయిన మంచాలకు నవ్వారు, దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. గెలాక్సీ క్లబ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, సెక్రటరీ నారిండి కిషోర్, ట్రెజరర్ ఎస్‌ఎమ్‌ఎస్ కుమార్, నీలిశెట్టి చెన్నకేశవులు, పేర్ల సత్యనారాయణ, నాగేశ్వర రావు, సుబ్బారావు పాల్గొన్నారు.

గాంధీజీ జీవితం ఆదర్శప్రాయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ప్రపంచానికి ఆదర్శ ప్రాయమని గాంధీ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు రాంపిళ్ల జయప్రకాష్ పేర్కొన్నారు. సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలోని గాంధీ ఆలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ దీక్షల విరమణ జరిగింది. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన హనుమ, తమ్మిన సోనియా, ప్రముఖ వ్యాపారవేత్త తమ్మిన మారుతీ, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బి.వసంత్‌కుమార్, కార్యదర్శి కొండాయగుంట రాము, గుర్రం ఏడుకొండలు, టి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ దీక్షలు విరమింపజేస్తున్న గాంధీ దేవాలయ కార్యవర్గం



నివాళులర్పిస్తున్న షేక్ ఆసిఫ్, నాయకులు



గాంధీహిల్‌పై నివాళులర్పిస్తున్న గోకరాజు గంగరాజు తదితరులు



వృద్ధాశ్రమంలో నివాళులర్పిస్తున్న గెలాక్సీ క్లబ్ సభ్యులు

ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో..

మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకుని భవానీపురం హౌసింగ్ బోర్డ్‌కాలనీలోని ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఏమినేని వెంకటేశ్వర్లు, పమిడిపాటి పట్టాభిరామారావు, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు దేవరకొండ శేషగిరిరావు, గౌరవ సలహాదారు కొత్తపల్లిసంజీవరెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని వించిపేటలోని మహ్మదాలీపురం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బీవీ నగరాజ కుమారి అన్నారు. పాఠశాలలో హిందీ దినోత్సవం, గాంధీ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జేవీఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో బుధవారం బహుమతులను అందించారు. సంస్థ కన్వీనర్ జే.వెంకటరెడ్డి, కమిటీ ప్రముఖులు బి.ఆంజనేయరాజు, జి.హరినాథ్, ఉపాధ్యాయులు పి.విజయలక్ష్మి, ఈ.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు 30 ఏళ్లు



30వ వార్షికోత్సవం జరుపుకున్న రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో నడిచే ఇంటర్ సిటీ రైళ్లలో ఐకానిక్ ట్రెన్‌గా పేరుగాంచిన రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుల ఆదరణతో 140 శాతం అక్యుపెన్సీతో మూడు దశాబ్దాలు విజయవంతంగా పూర్తిచేసుకుంది. ఈ మేరకు బుధవారం రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులతో కలసి అధికారులు బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రైల్వే స్టేషన్‌లో కేక్ కట్ చేసి 30వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజల డిమాండ్‌మేరకు రైల్వేబోర్డు ఈ రైలును ప్రకటించింది. దీంతో విజయవాడ–విశాఖపట్నం మధ్య 17246/17245 రైలు నంబర్లతో 1994, అక్టోబర్ రెండో తేదీన తొలిసారిగా రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు ఎక్కింది. అప్పటి నుంచి విశాఖ–విజయవాడ మధ్య ముఖ్యమైన రైలుగా మంచి గుర్తింపు పొందింది. అనంతరం ఈ రైలులో గణనీయమైన మార్పులు చేసుకుని 1999లో 2718/2717 నంబర్లతో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా ఆధునికీకరణకు నోచుకుంది. 2006లో ఈ రైలును ఆధునిక సీబీసీ రేక్‌లతోఅప్‌గ్రేడ్ చేసి 24 కోచ్‌ల సామర్థ్యంతో 12718/12717 నంబర్లతో సేవలు కొనసాగిస్తోంది. ఈ రైలును ప్రారంభంలో డబ్ల్యూఏఎం4 లోకో మోటివ్, అనంతరం ఎల్‌జీడీ డబ్ల్యూఏపీ4, ఎల్‌జీడీ డబ్ల్యూఏపీ7 లోకోమోటివ్‌లను ఉపయోగించడంతో వేగం మరింత పెంచుకుని సమయానుకులంగా నడిచే రైళ్లలో ఒకటిగా ప్రయాణికుల విశ్వాసం పొందింది.

రేపటి నుంచి చెస్ ఉచిత శిక్షణ తరగతులు

విజయవాడస్పోర్ట్స్: దసరా సెలవులను పురస్కరించుకుని చెస్ ఉచిత శిక్షణ తరగతులను ఈ నెల నాలుగు నుంచి తొమ్మిదో తేదీ వరకు పటమట ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ చెస్ అకాడమీ నిర్వాహకులు, అంతర్జాతీయ చెస్ కోచ్ షేక్ ఖాసిం తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు, సాయంత్రం 5.30 నుంచి ఏడు గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఏడు నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు మాత్రమే శిక్షణ ఇస్తామన్నారు. ముందస్తుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 98495 14138 ను సంప్రదించాలని కోరారు.

పాతబస్తీలో దసరా శోభ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాలకు వన్‌టౌన్‌లోని ప్రధాన ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. గురువారం నుంచి 10 రోజుల పాటు జరిగే దసరా ఉత్సవాలకు వన్‌టౌన్‌కు ప్రత్యేక స్థానముంది. ప్రధానంగా దుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తులు ప్రతి ఒక్కరూ వన్‌టౌన్‌లోని వివిధ మార్గాల మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దానికి తోడు వన్‌టౌన్‌లో ఆలయాల్లో ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి రోజూ ప్రత్యేక అలంకాలరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే ఆయా ఆలయాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు కూడా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ కళాకారులతో పాటుగా ఔత్సాహిక కళాకారులను ఆహ్వానించి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక వైదిక కార్యక్రమాల్లో ఉభయదాతలు పాల్గొనే విధంగా నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. శ్రీనివాసమహల్ సెంటర్ వద్ద వేంచేసి ఉన్న శ్రీ గంగానమ్మ దేవస్థానం, బ్రాహ్మణవీధిలోని శ్రీ చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానం, శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, వన్‌టౌన్‌లోని శ్రీ ప్రార్థనా మందిరంలో వేం చేసి ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల (పాత శివాలయం) దేవస్థానాల్లో దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజుకొక ప్రత్యేక అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు.



విద్యుత్ దీపాలంకరణలో చదును మహాలక్ష్మి అమ్మవారి ఆలయం



కేటీ రోడ్డులోని గంగానమ్మ ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లు